క్లుప్తంగా

శిబిరాలను వినియోగించుకోవాలి

నర్వ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జయరాములుశెట్టి అన్నారు. సోమవారం ఎల్లంపల్లి గ్రామంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ చెన్నప్ప, ఉప సర్పంచ్ నాగరాజు తదితరులున్నారు.

నేడు రాస్తారోకో

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్ బస్ స్టాప్ దగ్గర మంగళవారం రాస్తారోకో చేపడుతున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. బస్సుచార్జీల పెంపు నేపథ్యంలో కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. నారాయణపేట పట్టణానికి కేవలం 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న తాము మినిమమ్ చార్జీ కింద రూ. 20 చెల్లించాల్సి వస్తోందన్నారు. మద్దెల్‌బీడ్ వాసులు నిత్యం 300 మందికి పైగా పేట పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఇట్టి విషయాన్ని అధికారులు గుర్తించి చార్జీ తగ్గించాలన్నారు.

బోర్ డ్రిల్లింగ్‌కు ఆర్థికసాయం



దామరగిద్ద: మండలంలోని లోకూర్తి గ్రామంలో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు బసంత్‌రెడ్డి తన సొంత ఖర్చులతో బోరు డ్రిల్ చేయించి తాగునీటి సదుపాయం కల్పించారు. స్థానిక ఎస్సీ కాలనీలో భగీరథ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో ప్రత్యామ్నాయంగా రూ. వేల ఖర్చుతో బోరు వేయించారు. దీంతో కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

'తల్లిదండ్రులను పూజిద్దాం'

మక్తల్: నిజమైన ప్రేమకు తల్లిదండ్రులు నిదర్శనం అని ఏబీవీపీ నాయకులు అన్నారు. ఫిబ్రవరి 14న మాతృపితృ పూజ దివస్ అన్ని పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిద్దామని సోమవారం పిలుపునిచ్చారు. కార్యవర్గ సభ్యులు వినయ్, ఉపాధ్యక్షుడు నరేష్, సురేష్, శరణ్, రాజు తదితరులు ఉన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

మరికల్: మైనార్టీ కార్పొరేషన్ కింద దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 15 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యశోదమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం అవుతాయని అర్హులైన లబ్ధిదారులు హాజరుకావాలని సూచించారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

కోయిల్‌కొండ: మండలంలోని కేశ్వాపూర్‌లో చేపడుతున్న సీసీరోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని సర్పంచ్ మొగులయ్య అన్నారు. సోమవారం ఆయన సీసీరోడ్డు పనులను పరిశీలించారు. గ్రామంలో 150మీటర్లు మేర సీసీరోడ్డు వేయడం జరుగుతుందని, ఎన్ఆర్ఈజీఎస్ రూ.5లక్షలు, జిల్లా పరిషత్ రూ.3లక్షలు, గ్రామ పంచాయతీ ద్వారా రూ.2లక్షలతో రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

17న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూర్: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, వివిధ ప్రభుత్వ శాఖల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని, అలాగే మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

ఆత్మకూర్: మహిళలు రుణాలు పొంది వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా రాణించాలని పురపాలిక కమిషనర్ బీఎస్‌కే రమేష్, మెప్మా డీఎంసీ బాలరాజు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మహిళాసంఘాల సభ్యులు, ఆర్పీలతో సమావేశమయ్యారు. మున్సిపాలిటీ పరిధిలో 162 సంఘాలు ఉండగా 2,162 మంది సభ్యులు కొనసాగుతున్నారన్నారు. గతంలో తీసుకున్న రుణాలను చాలా మంది తిరిగి చెల్లించారని తెలిపారు. రుణాలు చెల్లిస్తేనే కొత్తగా రుణాలు అందిస్తామని పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఆత్మకూర్‌లో 452 మంది వీధి వ్యాపారస్తులకు రూ.10వేలు చొప్పున రుణాలు అందించామని వెల్లడించారు. ఇందులో 138 మంది తిరిగి చెల్లించడంతో రూ.20వేల చొప్పున రుణాలు అందించామని, ఈ బకాయిలను చెల్లించిన వారికి రూ.50వేలు చొప్పున రుణాలు అందిస్తామని సూచించారు. ఈ అవకాశాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యక్షురాలు ఉమాదేవి, కార్యదర్శి మంజుల, సంఘాల సభ్యులు, ఆర్పీలు ఉన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

- మండలంలో రెండు శిబిరాల నిర్వహణ
- అవసరమైన వారికి అద్దాల పంపిణీ
- పర్యవేక్షిస్తున్న అధికారులు



ఊట్కూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష (ఫైల్)



ఊట్కూర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

ఊట్కూర్: మండలంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. సెలవు దినాలు మినహాయిస్తే 17 రోజులుగా మండలంలోని రెండు కేంద్రాలలో శిబిరాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఊట్కూర్, పులిమామిడి ప్రభుత్వ ఆస్పత్రుల ఆధ్వర్యంలో జనవరి 19న రెండు శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేస్తున్నారు. కంటి శుక్లాలు ఉన్న వారిని ఆపరేషన్ల కోసం సిఫారసు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శిబిరాలకు వచ్చే వారికి తాగునీరు వంటి సౌకర్యాలను సిబ్బంది ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యధికారి రాంమనోహర్ రావు, కలెక్టర్ కోయ శ్రీ హర్షలు సందర్శించారు. శిబిరాలను డాక్టర్ భవానీ, డాక్టర్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు సుమలత, రాజేశ్‌లు పర్యవేక్షిస్తున్నారు.

పులిమామిడి ఆస్పత్రి ఆధ్వర్యంలో...

పులిమామిడి శిబిరంలో 17 రోజుల్లో 2210 మందికి పరీక్షలు నిర్వహించారు. రీడింగ్ అద్దాలు 254 మందికి పంపిణీ చేశారు. అదేవిధంగా 280 మంది దూరపు చూపు లోపం ఉన్నవారికి కంటి అద్దాల తయారీ కోసం సిఫారసు చేశారు.

గ్రామంలో 17 ఫిబ్రవరి వరకు, బిజ్వార్‌లో 20 ఫిబ్రవరి నుంచి 6 మార్చి వరకు, పాతపల్లిలో 8 మార్చి నుంచి 15 వరకు, కొత్తపల్లిలో 16 మార్చి నుంచి 20 వరకు, మొగ్దుంపూర్‌లో 21 మార్చి నుంచి 28 వరకు, యర్గట్‌పల్లిలో 29 మార్చి నుంచి 31 వరకు, పెద్దజట్రంలో 3 ఏప్రిల్ నుంచి 24 వరకు, అవుసలోనిపల్లి లో 25 ఏప్రిల్ నుంచి 3 మే వరకు, నిడుగుర్తిలో 4 మే నుంచి 18 వరకు, తిప్రాస్‌పల్లిలో 19 మే నుంచి 25 వరకు, పెద్దపోర్లలో 27 మే నుంచి 31 వరకు, లక్ష్మీపల్లిలో 1 జూన్ నుంచి 2 వరకు, చిన్నపోర్లలో 5 జూన్ నుంచి 19 వరకు, ఎడివెల్లిలో 9 జూన్ నుంచి 21 వరకు శిబిరాలను నిర్వహిస్తారు.

ఊట్కూర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో...

ఊట్కూర్ శిబిరంలో 2330 మందికి పరీక్షలు నిర్వహించారు. 260 మందికి రీడింగ్ అద్దాలను అందజేశారు. దూరం చూపు లోపం ఉన్న 300 మందికి కంటి అద్దాల తయారీకి సిఫారసు చేశారు.

గ్రామంలో మార్చి 28 వరకు, కొల్లూర్‌లో మార్చి 29 నుంచి 11 ఏప్రిల్ వరకు, మల్లెపల్లిలో 12 ఏప్రిల్ నుంచి 21 ఏప్రిల్ వరకు, నాగిరెడ్డిపల్లి లో 24 ఏప్రిల్ నుంచి 25 ఏప్రిల్ వరకు, సమస్తాపూర్ లో 26 ఏప్రిల్ నుంచి 28 వరకు, ఓబ్లాపూర్‌లో 1 మే నుంచి 5 మే వరకు, పగిడిమామిలో 8 మే నుంచి 19 వరకు, వల్లంపల్లిలో 22 మే నుంచి 26 వరకు, అమీన్‌పూర్‌లో 29 మే నుంచి 8 జూన్ వరకు శిబిరాలు నిర్వహిస్తారు.

ఉపయోగకరంగా ఉన్నాయి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలు ఉపయోగకరంగా ఉన్నాయి. పరీక్షలు బాగా నిర్వహిస్తున్నారు. మందులు అద్దాలు అందజేస్తున్నారు. నాకు సమస్య ఉండడంతో రీడింగ్ అద్దాలు ఇచ్చారు.

–బి.నారాయణ, ఊట్కూర్

అద్దాలు, మందులు ఇస్తున్నాం



కంటి వెలుగు శిబిరానికి రోజు 100 మందికి పైగా వస్తున్నారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, అద్దాలు అందిస్తున్నాం. కంటిలో శుక్లాలు ఉన్నవారిని ఆపరేషన్ల కోసం ఆస్పత్రులకు పంపిస్తున్నాం. ఇప్పటి వరకు 2330 మందికి పరీక్షలు నిర్వహించి 260 మందికి రీడింగ్ కంటి అద్దాలను అందించాం. సమస్యలు ఉన్నవారు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి.

–డాక్టర్ భవానీ, ఊట్కూర్

విద్యార్థికి అభినందనలు



ధన్వాడ: ఆజాదీ కా అమృత మహోత్సవ్ రాష్ట్ర స్థాయి రంగోలి పోటీల్లో ధన్వాడ మండల కేంద్రానికి చెందిన ఎ.చెన్నయ్య రెండవ బహుమతి సాధించాడు నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించి, సన్మానించారు. బహుమతి సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక తరలింపుపై వినతి

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలోని పెద్దవాగు నుంచి ప్రభుత్వ అనుమతులతో రెండు ప్రధానమైన ఇసుక రీచ్‌లు నడుస్తున్నాయని అయితే వాటి ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు వస్తున్నాయని సోమవారం జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్షకు గ్రామంలోని ట్రాక్టర్ల యాజమానులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాగు నుంచి రీచ్ వరకు ఇసుక తరలిస్తుంటే తమకు ట్రిప్‌కు కేవలం రూ. 350 నుంచి 400 వరకు మాత్రమే వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ అనుమతులతో స్థానికంగా గృహ అవసరాల కోసం టిప్పర్ల ద్వారా కాకుండా నేరుగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించుకునేందుకు అనుమతులు ఇచ్చి తమను ఆదుకోవాలని కోరారు. తద్వారా ఆర్థికంగా కొంత మేర లాభం ఉంటుందని అన్నారు. ట్రాక్టర్ల యాజమానులు వెంకటప్ప, శంకప్ప, వాబయ్య, గోపాల్, సాబెన్న, వెంకటప్ప, అంజప్ప, బుజప్ప తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ డిపాజిట్‌లను ఆపాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: విద్యుత్ శాఖ అమలు చేస్తున్న అడ్వాన్స్ డిపాజిట్ పేరుతో 20 శాతం అదనపు చార్జీలను వెంటనే ఆపాలని ప్రగతి శీల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు తాయప్ప ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ప్రమీలకు అందజేశారు. కార్యక్రమంలో గోవింద్, నర్సిములు, తాయప్ప, చంద్రప్పలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

నర్వ: పీఆర్‌టీయూ టీఎస్ బలపర్చిన గుర్రం చెన్నకేశవరెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిద్దామని జిల్లా ప్రధానకార్యదర్శి వై జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్వ, ఉన్నత పాఠశాల, కేజీబీవీ, పెద్దకడ్మూర్, ఉందేకోడ్, పాథర్చేడ్ పాఠశాలల్లో అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు, పదోన్నతులు చేపట్టడం హర్షనీయమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పీఆర్‌టీయూ పోరాటం చేస్తోందన్నారు. త్వరలో పండిట్, పీఈటీ అప్‌గ్రేడేషన్, అదనంగా 5200 పీఎస్‌హెచ్ఎం పోస్టులు మంజూరు అవుతాయన్నారు. సీపీఎస్ రద్దు అయ్యేలా కృషిచేస్తామన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా బాధ్యులు ఉస్మాన్, మల్లేష్, రహీమ్, ప్రవీణ్, తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షులు సూరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దకడ్మూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

డబుల్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో నిరుపేదలకు కోసం అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం భూ స్థలాలు కేటాయించిందని, పట్టాలు పొందిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు కాశీనాథ్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీహర్షకు వినతిపత్రం అందించారు. వల్లంపల్లి శివారులో సర్వే నెంబర్ 67లో 350 మందికి, సర్వే నెంబర్ 48లో 650 మంది పేదలకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 100 గజాల స్థలాలు ఇచ్చిందన్నారు. అందరికీ పట్టాలు అందించారని తెలిపారు. కాగా సొంతంగా నిర్మాణం చేసుకోవడానికి వాళ్లందరికీ ఆర్థికంగా అవకాశం లేని కారణంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకం కింద ప్రభుత్వం గృహాలను కూడా నిర్మాణం చేసి ఇవ్వాలని మంజూరు ప్రతాలను అందించిందన్నారు. నిర్మాణ బిల్లులు కూడా డ్రా చేసి సంబంధిత కాంట్రాక్టర్‌కు లబ్ధిదారులు ఇచ్చారని తెలిపారు. కాగా ఇంతవరకు నిర్మాణం పూర్తి కాలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అయిన పరిస్థితి మారుతుందని భావిస్తే ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉన్న ప్లాట్‌లు లాక్కుంటుందని ఊహించలేదన్నారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఇళ్లు నిర్మాణం చేసి ఇచ్చేంత వరకు ఉద్యమం చేస్తామని అన్నారు.

హరిత హారం మొక్కలు దగ్ధం

మాగనూర్: పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరిత హారం లక్ష్యం కొందరు అధికారుల నిర్లక్ష్యంతో తగలబడిపోతోంది. ఒకవైపు భారీ సంఖ్యలో మొక్కలను నాటుతూ, రాబోయే విడత కోసం నర్సరీల్లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తుంటే, మరో వైపు కొందరు పర్యవేక్షణ లేకపోవడంతో నాటిన వాటిని నరకడం, తగలబెట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మండల వ్యాప్తంగా తరచూ ఘటనలు పునరావృతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నేరడగం గ్రామానికి వెళ్లే దారిలో కొందరు మంటలు పెట్టడంతో ఈ మార్గం వెంట ఉన్న హరితహారం మొక్కలు చాలా వరకు కాలిపోయాయి. రూ.వేల కోట్లు వెచ్చించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంటే క్షేత్ర స్థాయి బాధ్యులు కనీస పర్యవేక్షణ చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నేరడగం దారిలో కాలిపోయిన మొక్కలు

పెద్దకడ్మూర్‌లో ఉపాధ్యాయులను నియమించాలి



పెద్దకడ్మూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బయోసైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని వాపోయారన్నారు. దీంతో ఎస్ఎస్‌సీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదేవిధంగా యూనిఫామ్స్ ఒక జత మాత్రమే అందిందని, పుస్తకాల సైతం సరిగ్గా అందలేదని విద్యార్థులు తెలిపినట్లు పేర్కొన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కోటకొండను మండలంగా ప్రకటించాలి

నారాయణపేట టౌన్ : మండలంలోని కోటకొండ గ్రామంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా బృందం సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాల్‌రాం మండలానికి కావాల్సిన అన్ని అర్హతలు కోటకొండ గ్రామానికి ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నారాయణపేట మండల రూరల్ పోలీస్ స్టేషన్‌ను అక్కడ నిర్మించాలన్నారు. అదేవిధంగా కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా నాయకులు దస్తప్ప, అంతన్‌గారి బాల్‌రాం, కావాలి కాశప్ప తదితరులు ఉన్నారు.

బడి ఈడు చిన్నారుల గుర్తింపు



చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఆర్పీ ఉషెనప్ప

దామరగిద్ద: మండలంలోని గడిమున్కన్‌పల్లి, దామరగిద్ద శివారులోని ఇటుక బట్టి కార్మికుల గుడిసెల్లో ఉన్న బడి చిన్నారులను సోమవారం గుర్తించారు. వారిని బడిలో చేర్పించాలని స్థానిక సీఆర్పీ ఉషెనప్ప అన్నారు. ఈ మేరకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

గడ్డి విత్తనాలు పంపిణీ చేయాలి

మరికల్: గడ్డి విత్తనాలు అవసరం మేరకు పంపిణీ చేసేందుకు పశు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు హన్మంతు, వెంకటయ్యలు అన్నారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 15 రోజుల క్రితం వచ్చిన గడ్డి విత్తనాలు రైతులకు సమాచారం ఇవ్వకుండానే పంపిణీ చేయడం పద్ధతి కాదన్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో పశువులకు మేత లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే పశువులు ఉన్న రైతులను గుర్తించి గడ్డి విత్తనాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ వైద్యాధికారి మహాదేవ్ మాట్లాడుతూ 50 బస్తాల గడ్డి విత్తనాలకు ప్రతిపాదనలు పంపించామని వారంలో రావచ్చన్నారు. రాగానే రైతులకు అందజేస్తామన్నారు.

అందుబాటులో యూరియా

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు ఆధార్‌కార్డు తీసుకొని స్థానిక పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చి సిబ్బందిని సంప్రదించాలని అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోనిని పరిమాళపురంలో 17వ 800 సంవత్సరాల చరిత్ర ఉన్న వినాయకునితో పాటు శ్రీరామునికి మైసూర్ ఎడతోరే యోగ నందేశ్వర మఠం పీఠాధిపతి భారతినంద తీర్థ స్వామి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షిత్ కుటుంబీకులు, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు.ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా సుజాత, జిల్లా కలెక్టర్‌గా వెంకటేశ్వరీ, జిల్లా విద్యాధికారిగా లావణ్య, ఎంఈఓగా ఉషారాణి వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్పందన, ఉపాధ్యాయులు రత్నమ్మ, హేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇల్లు దగ్ధం

కోస్గి: అనుమానాస్పద రీతిలో పట్టణంలోని పోషమ్మ గుడి సమీపంలో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితులు, కాలనీ వాసుల కథనం మేరకు పోషమ్మ గుడి సమీపంలో బోడి తిర్మలయ్య, బాలమణి దంపతులు తమ పిల్లలతో కలిసి సొంత పెంకుటింట్లో నివాసం ఉంటున్నారు. కొంతదూరంలో కొత్త ఇంటిని నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ప్రస్తుతం ఉంటున్న ఇంట్లో నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. గమనించిన కొందరు వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తెరిచి చూసే సరికి ఇంటిలోని సామాగ్రితోపాటు నగదు పూర్తిగా కాలిపోయాయి. కాలనీ వాసుల సహాయంతో మంటలు అదుపు చేశారు. కానీ బీరువాలో ఉన్న రూ.60 వేల నగదు, తులం బంగారం, చీరలు, భూములకు సంబంధించిన కాగితాలు, పిల్లల చదువులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు పూర్తిగా కాలిపోయాయని వాపోయారు. కాగా ఏదైన విద్యుత్ షాక్ జరిగిందా..? ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా చేశారా..? అని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తిర్మలయ్య తెలిపారు.



కాలిపోయిన సామగ్రిని చూపుతూ రోదిస్తున్న బాధితులు

'మోసపూరిత ప్రభుత్వాన్ని దించేయాలి'



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ

నారాయణపేట: తెలంగాణలో మోసపూరిత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించేయాలని బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తే బీజేపీకి పేరు వస్తుంది బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సోమవారం నారాయణపేట మండలంలోని బైరంకొండలో శక్తి కేంద్రాల కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి, కుటుంబపాలనను రాష్ట్రంలో అంతమొందించాలని ప్రజలకు కోరారు. తెలంగాణలోని సమస్యలను పక్కాదారి పట్టిస్తూ ప్రజలను మరోసారి మభ్యపెట్టడానికి తెరపైకి బీఆర్ఎస్‌ను తెచ్చారన్నారు. పాలమూర్-రంగారెడ్డి ప్రాజెక్ట్‌తో ఈప్రాంత ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. జీఓ 69 అమలుతోనే సాగునీరు అందుతుందన్నారు. సైనిక్ స్కూల్, వికారాబాద్, కృష్ణ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వాలన్నారు. ఫసల్ బీమా పథకం, ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జీకే నర్సిములు, అశోక్, రామకృష్ణ, శివకుమార్, శక్తి కేంద్రాల ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప ఉత్సవాలు

చిన్నచింతకుంట: మండలంలోని నెల్లికొండిలో గొల్లకుర్మలు సోమవారం బీరప్ప ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బీరప్పస్వామి ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య గ్రామంలో ఊరేగించారు. ఆలయం వద్ద బీరప్ప స్వామి విగ్రహానికి గంగాజలాలతో అభిషేకించారు. అనంతరం బండారును ఒకరిపై ఒకరు చల్లుకొని పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలతో మక్తల్ సీఐ సీతయ్య

మక్తల్: సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా మక్తల్ పట్టణంలో టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మొత్తం 16 జట్లు పాల్గొన్నాయని రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను సత్యసాయి మందిరంలో మక్తల్ సీఐ సీతయ్య చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, వరలక్ష్మి, చంద్రకళ, రమ్మణమ్మ, శ్రీలత, శ్రీనివాసులు, లక్ష్మారెడ్డి, అబ్దుల్, అంబ్రేష్, దామోదర్, కుర్మయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.